


ఆధారం·

శ్రీమతి ప్రమీలారాణి

"ఊఁ, తరవాత" అన్నాను. సుబ్రహ్మణ్యం చెబుతున్నాడు. తనెరిగిన, తన ఆత్మీయురాలైన 'రూప'నిగురించి 'సహనం'మీద చర్చించుకుంటూండగా అతను ఆడాళ్ళకి సహనం ఎక్కువనీ, నేను మగాళ్ళకి ఎక్కువనీ అనటములో అతని ప్రత్యక్ష అనుభవాన్ని చెబుతూ నిట్టూర్చాడు. మళ్ళీ అందుకున్నాడు.

"ఏం? తరువాయి ..రెండు మూడేళ్ళ దాకా 'రూప'ని కలుసుకోలేదు. వెనకటి వేసంకాలంలో వెళ్ళాను. 'రూప'కీ నాకూ ఉండే బాంధవ్యంకోసం నువ్వంత బాధపడక్కర్లేదు. కాని అది మాత్రం చాలాదగ్గిర బాంధవ్యం. బాంధవ్యంకంటె మా యిద్దరిమధ్య ఒక విధమైన స్నేహం ఉందంటే బావుంటుందేమో. అంతే నన్నొక బంధువులా కాకుండా ఆప్త మిత్రుడులా భావించింది 'రూప'—స్కూల్ ఫైనల్ పూర్తికాగానే చదువు మానేసింది. చాలా పట్టు పట్టారు యింట్లోవాళ్ళు చదువుకోవద్దని

మొన్న నేను వెళ్ళగానే మొదటిమాట "చదువు మానేసాను. చాలా మంచి పని చేసాను కాదూ?" అంది నవ్వుతూ.

నేను అభినందిస్తానని ఆమె యూహ కాని, "ఏం అంత ఘనకార్యంగా తోచదు. చదువుతే నేం?" అన్నా నవ్వుతూనే.

"సరదాక్కాదు కాని ఈ చదువువల్ల లాభమేమిటి చెప్పు?" అంది నవ్వు నాపుచేసి ఎంతో సీరియస్‌గా చూస్తూ.

"ఆ! దానికేంలే మంచి పనే చేసావు. ఏమిటి విశేషాలు?" అన్నా కుర్చీలోంచి లేస్తూ.

"అప్పుడే బయల్దేరుతున్నావేమిటి? చాలా రోజులైంది రావడం మానేసి, కూర్చో." అంది కూమన్నాను. ఏదో మాట్లాడింది. 'రూప' అతిమితిగా మాట్లాడే మనిషి. మనం పది మాట్లాడితే ఆమె ఒక 'మాట' మాట్లాడుతుంది. ఎదుటి వాడికి చాలా కోపమూ, విసుగూ కలుగుతాయిలే. దాంతో లేచిపోతాడు కూడా. అందుకోసమే అలామాట్లాడుతుందేమో! లేక పోతే అసలు వాళ్ళతో మాట్లాట్ట యిష్టం వుండదా? నేను మాట్లాడేప్పుడు మాత్రం చాలా యిదిగా మాట్లాడుతుంది. నేనెంత తగ్గిద్దామనుకుంటే అంత పెంచుతుంది. ఆమె దగ్గర కూచొని మాట్లాట్టంకూడా ఒక 'కళే' అంటాను. ఒకొక్కప్పుడు ఆమె ప్రశ్నలికి సమాధానం చెప్పటం చాలాకష్టంగా తోస్తుంది వికటంగా చెప్పి తప్పించుకో వొచ్చు కాదా అంటావు నువ్వు కాని వికట సమాధానం అసామర్థ్యాన్ని సూచిస్తుంది అంటుంది. నిజంకూడా అంతే. సరైన ప్రశ్నకి వికట సమాధానం చెప్పటం మన అశక్తతకి సూచనే. ఏ చొప్పదంటు ప్రశ్నలకన్నా అయితే నీ సిద్ధాంతం పనిచేస్తుంది కాని, ఆమె విషయంలో మాత్రం అది ఏపాటి పనిచేయదు. ఒక వ్యక్తితో ఎక్కువసేపు మాట్లాట్టమంటే నాకు చెడ్డ విసుగని యిదివరలోనే నీకు తెలిసి ఉంటుంది. ఒక్కనీ దగ్గరమాత్రం చాలా సేపుంటాను. అది నాబుద్ధిపూర్వక నిర్ణయం. మళ్ళీ 'రూప' విషయంలో అలా ప్రవర్తించాల్సి వచ్చింది. అది నా నిర్ణయం

కాదు. ఆమె నన్ను ఆ కట్టుకో గలిగింది. కూచున్న మనిషిని ఆమె యిష్టం లేకుండా నించోకుండా చేయ గలదు. అది ఆమెలో ఉండే ఏ భయంకర శక్తివల్లా కాదు. ఆమెలో ఉండే మాటకారితనపు చాకచక్యం వల్ల మాత్రమే ఏవేవో విషయాంతరాలు ఎంతెంత సేపో చెబుతుంది. చాలా సరదాగా చెపుతుంది. వింటూన్న కొద్దీ వినాలని ఉంటుంది. మధ్య మధ్య తనుచెప్పేదాన్ని తనేవిమర్శిస్తుంది. తప్పొస్తే సమర్థించుకుంటానని చెప్పి సమర్థించుకుంటుంది. ఆ వేళ కూడా ఏమో చెప్పింది.

వెళ్ళిన మరునాడు మధ్యాహ్నం మూడుగంటలకి యిద్దరం ఓ గదిలో కూచున్నాం. ఇంట్లో 'రూప' తల్లి మినహాగా ఎవరూ లేరు. ఆవిడ కూడా గాఢంగా కునుకు తీస్తోంది వంటింట్లో. ఎండ తీవ్రంగాఉంది. చొక్కా తీసేసి బనీనుతోటి, నిక్కరుతోటి మంచంమీద పడుకుని విసురుకుంటున్నాను. ఎదురుగా ఉన్న టేబిల్ దగ్గర కుర్చీలో కూర్చుని స్త్రీ 'స్వాతంత్ర్యాన్ని గురించి కాబోలు ఏదో పుస్తకం చదివి చెపుతోంది రూప. అక్కడక్కడ తన అభిప్రాయాలు కూడా యిస్తోంది. వింటున్నాను. ఆమె చదువుతూన్నప్పుడుమాత్రం బాగా విసురుకునేవాణ్ణి. మాట్లాడ్తూ విమర్శిస్తూ వుంటే చాలా శ్రద్ధగా వినటంలో చెమట పట్టినట్టు కూడా తెలీక విసురుకోటంకూడా మానేసేవాణ్ణి. అంత సరదాగా చెపుతుంది విషయాలు. ఆమె చెప్పే విషయాలు మనకి తెలియనివికావు. అయినా చెప్పే మనిషిలో ఉండే చాకచక్యం అదే అనుకుంటా. తెలిసిన విషయాలు కూడా మనకి తెలియనట్టుగా చేసేసి చెప్పటం కూడా ఆమె నేర్చుకున్న విద్యలలో ఒకటి.

చెబుతూ చెబుతూ "ఆడది పెళ్ళిచేసికోగూడ దంటాను," అంది సమాధానం కోసం ఎదురు చూస్తూన్న ముఖం నా వైపుకు త్రిప్పి.

పడుకున్నవాణ్ణిలేచి కూచున్నాను. ఏదో మాట్లాడ్తోంది అనే అనుకున్నానుగాని ఇంత యిదిగా ప్రశ్నిస్తుందనుకోలేదు అది అంటోన్నప్పుడు మాత్రం బాగా పరీక్షించి చూసాను. సరదాగా అనటంలేదు చాలా సీరియస్‌గా అంటున్నట్టు కళ్ళుచెబుతున్నై. సరదాగానే అంటే కళ్ళు చిలిపిగా నవ్వుతై. అది నాకు తెలుసు. అటువంటిదేమీలేదు. ఒక గాఢ విశ్వాసాన్ని, ఒక సమర్థ నిర్ణయాన్ని చెప్పేటప్పటి ధ్వని, చూపులు ప్రత్యక్షమైనై—చూసాను కాస్సేపు.

"రూపా! నీ భావం నాకు బోధపడలేదు. నువ్వు పెళ్ళి చేసికోనన్నే గూఢార్థమేమన్నా అక్కడుందా?" అని ప్రశ్నించాను తీవ్రంగాచూస్తూ.

"ఉంటే ఉండొచ్చు. ఏం? నువ్వు పెళ్ళి చేసికోనప్పుడు నేను మాత్రం ఎందుకు చేసుకోవాలి?" చాలా సాగదీసి ప్రశ్నించింది. ప్రశ్నించిన వ్యక్తి సమాధానం అపేక్షించినట్టు గాకుండా ఉపేక్షగా పుస్తకం వైపు చూడనారంభించింది చాలా నిర్లక్ష్యంగా.

"అంటే నేను పెళ్ళి చేసుకోటం లేదు కనుక నువ్వూ మానేస్తావా? ఒకవేళ నేను పెళ్ళాడితే నువ్వూ పెళ్ళాడ్తావా?" అని ప్రక్కకి తిరిగి ప్రశ్నించాను.

"ఆ నిర్ణయాన్ని యివాళ తేల్చలేను. ఒకవేళ నీ నిర్ణయానికి స్థావరత్వం లేకపోతే లేక పోవొచ్చు. కాని నా నిర్ణయం ఎప్పటికీ నిర్ణయమే.. " అంది. అప్పట్లో ఆమె మాటల్లో ఏ విధమైన భావమూ మరుగుపడ్డట్టు ధ్వని కూడా చెప్పలేదు.

"అయితే నేను పెళ్ళాడితే నీ కిష్టమేనా?" మళ్ళ ప్రశ్నించా.

"అంటే నాతో నీ పెళ్ళా?" చాలా తీవ్రమైన చూపులతో అడిగిరది.

"నా పెళ్ళినిర్ణయాన్ని బట్టికదా నీ నిర్ణయం. ఈ నిర్ణయాలు రెంటికీ మధ్యఏదో ఒక పరస్పర సంబంధం ఉండి ఉండాలి. ఆ సంబంధం నేను నిన్ను పెళ్ళి . " ఇంకా ఏమో అందును కాని ఆపుచేసింది—

"అటువంటి ఆపోహాలు కలిగించుకోకు—నాకు పెళ్ళి చేసుకోవాలని లేదు. అంతే" అంది గొంతులో కొద్దిగా మార్పుంది—

"పెళ్ళి చేసుకోవాలని లేదు. బాగానే ఉంది. చేసుకోవాలని లేక పోవటానికి కారణం?" అన్నాను ఏం సమా

ధాన మిస్తుందోనని ఆతురతగా చూస్తూ, రెండు నిమిషాలాలోచించింది.

"నీ నిర్ణయానికి కారణం?" మళ్ళీ ప్రశ్నించింది. నా సమాధానమే తన సమాధానంగా కూడా తీసికోమని అనేస్తుంది. అదే ఆమె భావం.

"నా యిష్టంమీద నా నిర్ణయం జరిగింది" అన్నాను ఏ ఆలోచనా లేకుండా. "అంతే నేనూనూ" అనేసింది. పెద్దబాధలేకుండా మాటలకోసం.

"ఆ యిష్టానిక్కూడా కారణాలుండాలిగా?" అనుకోకుండా ప్రశ్నించాను. నాకే ఈ ప్రశ్నతగిల్తే ఏం జవాబుచెప్పాలో మాత్రం తెలీదు.

"అన్నీ నేను చెప్పడం ఎందుకు? నీ నిర్ణయాలమీదా-వాటి కారణాలమీదా - కారణాలకి హేతువులమీదా నా నిర్ణయాలు జరిగినై" చాలా హేళనగా, అనవసర ప్రశ్నగా సమాధాన మిచ్చింది.

"రూపా! చాలా పొరబడుతున్నావ్. నానిర్ణయాలూ, హేతువులూ నీవూ అన్వయించుకుందుకు వీల్లేదు. నేను మగాణ్ణి నేనెలాపోయినా బాధలేదు. ." ఉపన్యాస ధోరణిలోపోనిద్దును. కాని అడ్డేసింది, నే చెప్పిదంతా సత్యం అనిమాత్రం తెలుసు.

"ఈ లేని ఆధిక్యత మగాళ్ళకెక్కణ్ణుంచి వచ్చింది?" కోపంగా విచార రేఖలుకూడా వచ్చినై. ఉడుకు మోత్తనం వల్లకాదు. జరిగే అన్యాయంవల్ల—

"ఎవరికి తెలుసు, తరతరాలనుంచీ నరనరాల జీర్ణించిన సత్యం అది" అన్నా, నే బాధలేనట్లు.

"నువ్వుకూడా సమర్థిస్తున్నావన్న మాట ఈ దౌర్జన్యాన్ని", విచారంతో కుర్చీలోంచి పోబోయింది కాని కూచోపెట్టి తలుపు జేర్లేసా.

"దౌర్జన్యమా? సౌజన్యమా? అనాదినుంచి వస్తోందన్నాను కాని సమర్థించలేదే. అదీ కాక ఉన్న స్వాతంత్ర్యాన్ని లేనివాళ్ళకోసం వదులుకోటంవల్ల యిద్దరూ బాధపడాలి. ఆ నాడు జరిగేదేమీలేదు. నన్ను నీ ఛాయలకి దిగమంటం కంటె నువ్వు నా ఛాయల్లోకి ఎక్కడానికి ప్రయత్నించు .. "అన్నాను. కొంత తృప్తిపడ్డట్టుంది. వేడి నిట్టూర్పుతో విచారాన్నీ, కళ్ళనీళ్ళనీ, బాధనీకూడా వదిలేసింది. కాని సంతోష రేఖలు మాత్రంలేదు.

"అయితే నన్ను పెళ్ళిచేసికోమనకు" అని బ్రతిమలాడుతూన్నట్లు అడిగింది.

"కారణం చెప్ప రూపా? నేను మానేసినా లోకం ఏమీ అనలేదు. నువ్వుమానేస్తానంటే లోకందాకా అక్కర్లేదు. కన్నతల్లి దండ్రులకే బరువుచేటవుతావ్. నువ్వెంత వద్దన్నా మీ నాన్న అంగీకరించడు," అన్నాను బరువుగ్గా అడుగులేస్తూ పచారుతో.

"అమ్మకీ నాన్నకీ బరువా? తల్లి దండ్రుల హృదయాలనే రాళ్ళల్లా మార్చేసే సంఘం పోనీ నువ్వు.. " ఏదో ఆశగా అడగబోయింది.

"ఎంతోఘట్టిగా నవ్వాలనుంది రూపా! కాని రావటం లేదు. చాలా తేలిగ్గా నా ఓపిక నిర్ణయం చేసావ్? ఎంతటి అప్రయోజకుణ్ణో ఒక్కమాటలో తేలిపోతుంది. ఇన్నాళ్ళూ ఏమో అనుకున్నానే కాని యిటువంటి కష్టతర సమస్యలు ఎదురరౌతాయని ఊహించలేదు. కనీసం కలగన లేదు. అయినా పరిస్థితులు విషమిస్తే ఆ పాటి సహాయం చేయగల్లనే" అన్నాను—

అంతే చాలన్నట్లు ఎంతో సంతోషంగా "అమ్మయ్య! జీవితంలో ఎవర్ని నమ్ముకుంటే నిశ్చిత నిర్ణయాలు నిశ్చితంగా నెరవేరుతయో వెతుక్కో గలిగినందుకు నన్ను నేను అభినందించుకుంటున్నాను. కాని సాయం చేయిగలను అనే మాటుమాత్రం మరిచిపోకు" అంది.

అప్పుడు చూసా నామె ముఖంలో నవ్వు. నా బుర్రలో గిర్రుగిర్రున చెరుకుగానుగలు తిరుగుతునై. మనస్సు ఎన్నెన్నో ఆలోచనలమీద పోతోంది. అనుకోని సమస్య లడ్డమైతే కలిగే విపరీతమే యిదేమో? ఆమె హృదయం ఎంత శాంతంగా ఉందో నాదంత భారంగా ఉంది. "సాయం చేయగలను" మాట నేసాను. నిజంగా అటువంటి పరిస్థితులే ఏర్పడితే ఏమన్నా చేయగలనా? ఏమో? ఏమో ఏమిటి? చేయగలను. ఇంత చదువూ చదివి ఒక్క స్త్రీని పోషించ

లేక పోతానా ? ఈ విశాల విశ్వంలో ఇరువురు వ్యక్తుల జీవనోపాధికే ఆటంకమా ? ఆలోచిస్తూ పడుకున్నాను. మళ్ళీ బుర్రమళ్ళింది. అటువంటి పరిస్థితులొచ్చి నప్పటి మాటకదా ? ఆ—ఎంత నిర్ణయాలైనా "రూప" నిశ్చితంగా ఉంచుకుంటుంద నేమిటి ? ఏదో ఆషా మాషీ నిర్ణయాలు కాదు. ఆషా మాషీ నిర్ణయాలయితే అంత బాధతో చెప్పదు. ఆమె నిర్ణయం నిశ్చితమైనదే కాకుండా కఠినతరమైనది. అందుకే నాసాయాన్నపేక్షించింది. ఇంతసేపు విచారంగా ఉన్నదంతా నిర్ణయాన్ని నిర్ణయంగా ఉంచుకుందుకి తనకి కావలసిన సాయం కోసమే. కానీ—మాట యిచ్చాం—

౨

రోజులు దొర్లాయి—రెండు మూడు నెలలు అలానే ఏవోఏవో సమస్యల్ని గూర్చి చర్చిస్తూ సరదాగా కాలం గడిపేవాళ్ళం. ఇంత విజ్ఞానం ఈమెకెలా కలిగిందా ? అనే ఆశ్చర్యంకూడా అప్పుడప్పుడు కలిగేది. కాని అంతలోనే ఆమెలో చాలా మార్పులు గోచరించాయి. ఆ మార్పులు చాలా ప్రమాద పరిస్థితులకి దారితీయగల వనటంలో సందేహంలేదు. రాను రాను ఆమె ప్రవర్తన చాలా అసహ్యంగా కనపడేది. అవి నీతికి దారితొక్కేదిగా కూడా కనపడింది. దూరదూరంగా ఉండి మాట్లాడేవ్యక్తి మీదిమీదికి రా నారంభించింది. కూచుని చదువు కుంటూంటే "ఏం చదువుతున్నావ్ ?" అని అడిగే వ్యక్తి బుజంమీద చేతులూని వెన్నువంచి వంగిచూచేది. మంచినీళ్ళడిగినప్పుడు తెచ్చి టేబిల్ మీద పెట్టే వ్యక్తి చేతికందిచ్చేది. అందుకున్నాక కూడా వదిలేదికాదు. విసువెత్తి నేను విదిలేస్తే తనూ కాళ్ళమీద పడేలావదిలేసి "దెబ్బతగిలిందా ?" అని కాలిమీద రాసేది. రాత్రివేళల్లో దొడ్లో పచారు చేద్దామనేది. ఒకటేమిటి ఈ రీతిగా ఒక్కొక్కప్పుడు కుర్చీలో కూచుంటే పక్కగా కూచుని బుజంమీద చేతులేసి చక్కిలిగింతలు పెట్టేది. ఎన్ని రకాలుగానో నన్ను ఆకర్షిద్దామని ప్రయత్నించింది. ఆమె ఏ ప్రయత్నానికీ నేను లొంగలేదు, సరిగదా ఆమె ప్రయత్నాల విషయంలో చాలా అసహ్య భావం కూడా చూపేవాణ్ణి. ఈ ప్రవర్తనలో అణగిఉన్న ఆమె ఆశేమిటో నాకు బోధపడలేదు. నాలుగు రోజులు యవ్వనంలో ఉన్న మనిషి యింట్లోవుంటేనే యింత కామానికి లోబడే వ్యక్తి ఎంతకాలం పెళ్ళి చేసుకోకుండా ఉంటుంది ? ఈ పాటి తాహతుగల వ్యక్తేనా జీవితాన్ని బ్రహ్మచర్యంతో గడపటానికి నిశ్చయంచేసుకున్న, నిర్ణయంచేసుకున్న వ్యక్తి ? ఈ నెలల్లోనే యింత బాధపడితే జీవితంలో యింకా యింకా ఎటువంటి విషమ పరిస్థితుల్ని ఎదుర్కోవలసి వస్తుంది. కోరికల్ని అణచిపెట్టుకోలేని అబల ఆ జన్మాంతం అవివాహితగా ఉంటుందంటే నమ్మడం కష్టతరం. ఎలా నమ్మడం ? ప్రత్యక్షంగా తన అశక్తత వ్యక్తీకరింప బడుతుంటే! ఈపాటిదానికి ప్రమాద పరిస్థితులు—నేను సహాయపడ్డం ? అనేవి—ఆమె అవినీతికి పాల్పడుతూ అది వెల్లడవకుండా కాపాడడానికా ? తాను నైతిక పతనం పొంది తన్మూలంగా తనకు తానై కోరి ఏరి నడచే ముళ్ళ బాటను బాగు చేయడానికా నేను ? షభాస్—తను చేయ బోయే మహాపాపాలన్నిటినీ నేను అడ్డుతూండాలన్న మాట ! ఈ ఉద్దేశాలన్నీ హృదయంలో ఉంచుకునే నావాగ్దానం తీసుకుంటూ ఇంతటి కుటిలబుద్ధితో ప్రవర్తిస్తుందని తెలిసుంటే ఆనాడే తగిన ప్రాయశ్చిత్తంచేసి ఉండేవాణ్ణి. లేకపోతే ఈ పాటికి ఆమెను ఏ యింటి కోడలుగానో చేయడానికి ప్రయత్నించి ఉండేవాణ్ణే. అదీ అసాధ్యమైతే మా యిద్దరి మధ్యనున్న 'మైత్రి'ని పటాపంచలు చేసేవాణ్ణే—

మైత్రి తలపుకొచ్చేప్పటికి ఒక్కసారి ఆ ఊహాలన్నీ మాయమై—నన్ను పెళ్ళి చేసుకోవాలనే తలంపుతో కాని ఈ రీతిగా ప్రవర్తించటంలేదు కదా ! దానికి ఆస్కారంలేదే ! నా నిర్ణయాన్ని నే నెన్నడూ మార్చుకోలేననీ మార్చుకోనని కూడా ఆమెకు తెలుసే. అయినా మార్చలేమా ? అని ఆమె ప్రయత్నమే అయితే దాని ఫలితం శూన్యం మాత్రమేనని గ్రహించి ఉండాలి. గ్రహించికూడా చేసేటంతటి అజ్ఞానికాదు, వ్యర్థజీవి కాదు. మరి ?—అదే తెక్కుండావుంది. ఒకవేళ నానిర్ణయాలే తనకీ ఉన్నాయని నటిస్తే ఆమెకు లోబడి పోతాననే తెలివి తక్కువ అభిప్రాయం ఏమీలేదు కదా ! అంత తెలివి తక్కువదై యుండదు. ఉండక పోతే ఈ ప్రవర్తనలో యిమిడి ఉన్న స్వార్థం ? అంతే—అదే అభిప్రాయం "మన అభిప్రాయా లేకీభవిం

చాయి కనక మనిద్దరం కలిసి ఉందాం" అనేద్దాం అనుకుంటోందేమో? ఏమో? ఏదీ బోధపట్టంలేదు. తీవ్రంగా ఆలోచించాను—ఆలోచించిన కొద్దీ రకరకాల ఊహాలు ఛకచకా సాగుతున్నై. ఒకటీ నిశ్చయంగా నిలవటం లేదు. మళ్ళీ ఇంకో ఊహ తట్టింది. ఒకవేళ నా శీలం విషయంలో ఆమెకేమన్నా అనుమానం కలిగి ఈ రీతిగా ప్రత్యక్ష ప్రమాణం కోసం ప్రయత్నించటం లేదు కదా? ఏ విధమైన అనుమానమూలేని నా విషయంలో ఆమె కనుమానం కలగడానికి ఆస్కారం ఎక్కడిదీ? ఇది చాలా తెలివితక్కువ ఆలోచనగా తోచింది. మన విషయంలో మన కనుమానం లేకపోయినా లోకం అనుమానించకపోదు. అయితే 'రూప' లోకంలోని మనిషే. అయితే రూపకీనాకు మధ్య ఈ మైత్రిలో ఉండే విలువేమిటి? కాదు. రూప లోకంలోని అందరిలాంటిదీకాదు. కాకపోతే మరెందుకిలా ప్రవర్తిస్తోంది? యిన్నాళ్ళూలేంది ఆమెలో ఈ మార్పెందుకు కలగాలి?

ఎటు చూసినా కాని నిశ్చయంగా ఆమెకు నన్ను పెళ్ళి చేసికోవాలనే భావమే బాగా కనపడుతోంది. తప్పితే మరోటి లేదు—" ఇంకా ఏదో చెప్ప బోతూ ఉండగానే "అయితే ఆమె ఆ అభిప్రాయంతోటే ఉంటే పెళ్ళి చేసుకుందుకి నువ్వు సిద్ధపడేవాడివా?" అని ప్రశ్నించా నతని నిర్ణయ పరీక్షకోసం. "అది యిప్పుడు చెప్పలేను పరిస్థితులెలా ఉండేవో? ఏం చేసేవాణ్ణో. అదలావుంచు చెప్పేది విను—

"ఆమె నన్ను పెళ్ళాట్లానికే ఈ ప్రయత్నం చేస్తోందో? కాక నన్ను పరీక్షిస్తోందో? లేక తన అవసరాలకి నన్నొక ఆటబొమ్మగా ఉంచుకోవాలని తలుస్తోందో? ఈ మూడు సమస్యలతోటి సతమతమౌతూ ఆమె ప్రయత్నాలన్నీ తీవ్రంగా కనిపెట్టి చూస్తున్నాను. ఎప్పుడు చూసినా అమూడే కనబడ్తున్నాయికాని ఏ ఒక్కటి నిశ్చయించే అవకాశం చిక్కటంలేదు. అక్కడికీ నాకు నేనై అడిగితే చులకనగా ఉంటుందని చాలా ఓపికతో ఆమె ప్రవర్తనని పరిశోధించాను. రోజులు గడిచాయ్—వారాలు కూడా దొర్లాయి కాని ఏమీ అంతు చిక్కలేదు. ఆ గంభీర హృదయపు లోతులు తెలుసుకుందుకు ప్రయత్నించడం వ్యర్థ యత్నంగానే తోచింది. ఆమె ద్వారానే నిర్ణయింప జేసుకోవాలనే నిశ్చయానికి వచ్చేసాను. రాత్రి ఎనిమిదింటికి యింటికి వచ్చాను. ఇంట్లో అంతా సినీమాకు వెళ్ళారు. 'రూప' మాత్రం మంచంమీద పడుకుని దీర్ఘంగా ఆలోచిస్తోంది. లోపలికెళ్ళి తలుపు గడియవేసాను. ఇంట్లో అంతా సినీమా ప్రయత్నంలో ఉన్నట్లు సాయంత్రమే తెలుసు. కాని 'రూప' వెళ్ళదనుకోలేదు—

"ఏం రూపా! సినీమాల మీద మోజు తగ్గిందా?" కుర్చీలో కూచుంటూ ప్రశ్నించా. ఒక్కసారిగా మంచం మీంచి లేచివచ్చి కుర్చీచేతిమీద కూచుని బుజం మీద చేతులూని నడుంవాల్చి ఆవలించి "వెధవ సినీమాలు పోనిద్దూ!" ఏదో ఆశ అంతర్భూతమైనట్లు తోస్తోంది. ఇప్పుడే నిర్ణయించుకోవాలను కొన్నాను. ఈ ముసుగుల్లో గుద్దులాట నాకేం నచ్చలేదు. తనకు తాను ఫలానా అని చెప్పదు. 'ఫలానా' అని చెప్పలేదేమో! అడిగినా చెప్పదా? చెప్తుంది. చెప్పేదాకా వదలదల్చుకోలేదు. అడిగినప్పుడుకూడా కప్పిపుచ్చాల్సినంత అవసరం ఏమిటి?

"రూపా! కొంచెం అలా మంచంమీద కూచుంటావ్- నీతో ఒక అత్యవసర విషయాన్ని మాట్లాడాలి. ఇలా కూచుంటేమాత్రం నేను చెప్ప లేను" ఆజ్ఞాపిస్తున్న కంఠస్వరంతో అన్నాను.

"ఏం? అంత అత్యవసర విషయం దగ్గిరుండగానే ఎందుకు చెప్పకూడదు" చాలా హేళనగా వెన్ను తల మీద ఆనుతూ అందేకాని లేవలేదు. నేనే కుర్చీలోంచి లేద్దామనుకొన్నాను. కాని ఠకీమని తలబద్దలయేటంత దెబ్బ తగిలేలా వెనక్కిపడ్తుంది. అంచేత జాగ్రత్తగా చేతులతో తల నదిమిపట్టి కుర్చీలోంచి లేచి ఆమెనందులోకి దింపివోయి బల్లమీద కూచుని "రూపా" అని పిలిచా. ఈ సారి 'రూపా'లో ఒక రకమైన భావం కనపడ్తోంది. ఇందాకా వున్నకులాసా, సంతోషం కొంత వరకూ తగ్గినై—చాలా తీవ్రంగా నావైపుచూస్తూ "ఆ" అంది.

"నా ప్రశ్నలకి సమాధానం యివ్వాల్సిన బాధ్యత నీకుందనుకుంటా?" అన్నా తలవాల్చి పుస్తకంలోని పుటలు తిరగేస్తూ

"బాధ్యతలూ—ఖారారులూ నామీద ఏమీ ఉంచకు" అంది.

"నీకు నీవై తెచ్చుకుంటే?" ప్రశ్నించాను.

"నే నింతవరకూ అటువంటివేమీ తెచ్చుకో లేదు—" ఇంకా ఏదో అనబోతోంది కాని సమయం కాస్తా సమాధానాలతో పోనిస్తే అసలు విషయం తెలుసుకుందుకి ఆలస్యమౌతుంది.

"రూపా! కాస్సేపు వేళాకోళం ఆపుచేయి. ప్రశ్నకి ప్రశ్నలో సమాధానం పెద్దతెలివైన పనికాదు. అదీకాక యిప్పుడు నీతో వాగ్వాదానికి రాలేదు. నా సందేహానికి సమాధానం చెప్తావా?" చాలా సీరియస్‌గా అడిగాను.

"నువ్వంత కోపంగా మాట్లాడ్తే నేనసలు సమాధానమివ్వను" అంది.

"కోపం కాదు—ఇప్పటికి నెల్లాళ్ళ నుంచి ఓపికతో చూస్తున్నాను నీ ప్రవర్తనలో చాలా మార్పు వచ్చింది. వచ్చిన రోజులో నువ్వు నన్నడిగిన సాయం ఇందు కోసమేనా?" అని కాగితాలు గబగబా తిప్పుతూ ప్రశ్నించా. రెండు నిమిషాలు 'రూప' స్తబ్ధయై కూర్చుంది మళ్ళీ.

"అంటే నీ ఉద్దేశ్యం?" ప్రశ్నించింది.

"ఆ నాడు నాసాయాన్ని నువ్వు అపేక్షించుటలో నన్ను పెళ్ళాడాలనే తలంపు ఏమన్నా ఉందా?" ఆమె కేసి చూస్తూ అడిగాను.

"ఉంటే?" చాలా నిరసనగా కుర్చీలోంచిలేచి పచారు చేస్తూ అడిగింది.

"ఉంటే ఏమిటి? ఉందా? అని అడుగుతున్నాను. కాకపోతే నీ ప్రవర్తనలోని ఆంతర్యం?" బొమలు ముడి వేసి అడిగాను.

పకపకా నవ్వింది. "పిచ్చివాడా!" అంది.

"నిజంగా నీ ప్రవర్తన నన్ను పిచ్చివాణ్ణి చేస్తోంది. నీకు నన్ను పెళ్ళాడాలనుంటే నాన్నతో చెప్పి రేపే ఖాయం చేయిస్తాను" నాకున్న అధికారాన్ని నా అభిప్రాయాన్నీ కూడా ఆమెకు చూపాలనే భావంతో చాలా సౌమ్యంగా అడిగా.

"నువ్వింత చులకనగా చూస్తావనుకోలేదు' కళ్ళ నీళ్ళు మాత్రం రాలేదంతే. అంత విచార ముఖంతో అడిగింది నిలబడి.

"నీ ప్రవర్తన నిన్నింత చులకనచేస్తోంది" చాలా కర్కశంగా అన్నా.

"నా ప్రవర్తనలో ఉన్న ఆంతర్యం నీకేం తెలిసింది?" అడిగిందామె.

"తెలీకనే యిన్ని సమస్యలెదురై నీ ద్వారా నిర్ణయించుకుందుకి వచ్చాను" బల్లమీంచి దిగి నిలబడి అడిగాను

"పుష్పవేణిని ఎరుగుదువనుకుంటా. నీకన్న రెండు క్లాసులు తక్కువగా ఉండేది హైస్కూల్లో. ఆమె నీ ప్రవర్తన విషయంలో చాలా అనుమానాస్పదంగా ఒక రౌడీలా ఇంకా నీచుడిలా చెప్పింది. అదేమిటో నిర్ణయించుకుందుకి నేనిలామారాను. కాని వేణి చాలా పొరబడింది. అయితే వేణికి ఆ భావం ఎందుకు కలిగిందో ఊహించడం కష్టం—ఊహించను కూడా" అంది కుర్చీలో కూచుంటూ.

"చెప్పుడు మాటల నిర్ణయాల కోసం చెడదల్చుకున్నావా?" అన్నాను.

"చెడేట్టయితే చెప్పవిప్పేదాన్ని" అని ధీమాగా అంది. అయిదు నిమిషాలు నిశ్చలంగా కూచున్నాం. నా బుర్ర ప్రశాంతంగా తయారైంది. దురూహాలన్నీ పోయినై. అలానేపోయి మంచంమీద పడుకున్నా. నిద్రపట్టేసింది—

3

ఎంతకాలం ఈడొచ్చిన పిల్లని యింట్లో పెట్టుకున్కూచుంటారు తల్లిదండ్రులు? అయినా పిల్లకంత యిష్టం లేనప్పుడు సంఘాన్ని తిరస్కరించాల్సిందనే నా అభిప్రాయం. కాని మన పిల్లకాదుకా! తండ్రి ప్రయత్నించాడు—ప్రయత్నించాడు—ప్రయత్నానికి ఫలితం ఉండక పోదు ఫలితం లేదంటే అది ప్రయత్నలోపమే. మొత్తం మీద పెళ్ళికొడుకుని తీసుకొచ్చారు. చూసింది పిల్ల. బజారుకెళ్ళినప్పుడు ఏదన్నా వస్తువుకొనాల్సుంటే ఏ వస్తువు బాగుంటుంది అని చూస్తాంకాని అసలు ఏ వస్తువూ అక్కర్లేనప్పుడు బాగోగు

లతో పనేమిటి ? ఆ భావాన్నే చూపించింది. కాని తండ్రి అంగీకరించలే. ఫిడేల్ వాయించమన్నాడు. శృతి వేస్తూనే తీగలు తెంపేసింది. పాడమన్నాడు. అసావేరి ఆలాపించింది పెళ్ళికొడుకు 'గ్రాడ్యుఏట్' అన్న మాటే కాని వాడికి ప్రపంచ జ్ఞానం లేదు. సాయంకాలం 'రూప'ని కలుసుకున్నాను.

"ఏం ? పెళ్ళిచేసుకుంటావా ?' తెలకాయవాల్చి అడిగాను ఎంతో బాధపడుతుందని తెలుసు—

"పెళ్ళిచేసుకోటం తప్పని సరయితే ఈ మనిషికంటే వీధివెంబడిపోయే బిచ్చగాణ్ణి చేసికోటం నాకిష్టం ?" అంది చాలా బాధతో.

"వాళ్ళతో ఏమన్నావ్ ?" ప్రశ్నించా—

"మీ యిష్టంమీద జరపండి నాకు మాత్రం ఈషత్తూ యిష్టంలేదని చెప్పాను" అంది విచారిస్తూ.

"నాతో అన్న మాటే వాళ్ళతోను అనలేక పోయినావ్ ?" అని అడిగాను.

"కన్నవాళ్ళయినా నీ అంతగా నా కష్టాల్ని వాళ్ళు పంచుకోరు—సరేలే. ఇదివరలో నిన్ను నేనొక సహాయం అడిగాను. అది ఇప్పట్లో అవసరం ఏమంటావ్?" అంది నెమ్మదిగా.

ఆలోచనలు ఆవరించాయ్. ఆమె యే సహాయం కోరుతుందో నాకు తెలుసు. "అడుగు" అన్నాను—

"పెళ్ళి నిశ్చయమయితే ఆ నికృష్ట జీవితాన్ని నేను ఈడ్చలేను. చస్తూ బ్రతుకుటకంటె చావటంమేలు. అంచేత ఆ విషయంలో—నువ్వు సైన్సు స్టూడెంట్‌వి కనుక చాలా దగ్గర మార్గంచూపు" అని ఎంతో బాధతో అడిగింది— "బాక్సైనాసరే—పొటాషియమ్ సైనైడ్ అయినా సరే" అని మళ్ళీ అడిగింది.

"రూపా! అంతసాహసంవద్దు .." అన్నా.

"నా సాహసంతో నీకు సంబంధం లేదు—సహాయం చేస్తానన్నావ్ కనుక అడిగా" అంది. ఆమె దుఃఖవదనాన్ని చూసి సహించలేక "సరే" అన్నా.

"మరచిపోక" అంది.

ఆ మరునాడే నేనింకక్కడ ఉండలేక వెళ్ళిపోయ్యా—పెళ్ళినిశ్చయమైనట్టూ బయల్దేరి రమ్మనట్టూ ఉత్తరం వచ్చింది ఈలోగా వెడితే విపరీత పరిస్థితుల్ని ఏర్పరిచిన వాణ్ణవుతానని వెళ్ళలేదు. నాకు చెప్పకుండా 'రూప' సాహసించదు. పెళ్ళినాటికి వెళ్ళాను. ఏడుస్తూంది రూప.

"రూపా! వంశమర్యాద కోసం నీ జీవితాన్ని త్యాగం చేయి. నీ కిష్టంలేని బాధల్ని సహించు" అన్నా. చాలా కర్కశ శిక్ష అని తెలుసు.

"సహనానికే స్త్రీ జన్మించింది కాబోలు. తప్పదు. నీ మాట మీద సహనాన్ని నేర్చుకుంటా" నంది. పెళ్ళై ఏడాదవుతోంది. సహిస్తూనేఉంది కష్ట జీవితాన్ని, ఇష్టం లేని భర్తతో కాపురంచేసే భగ్నజీవి ఆమె అని నిట్టూర్చాడు—

★

---

(40 వ పేజీ తరువాత)

సుభద్రమ్మ ఈమె కొన్ని శతకాలు, దండకాలు చేసింది. వాటిలో ప్రధానమైనవి కేశవ శతకము, కృష్ణ శతకము.

పందొమ్మిదవ శతాబ్దంలోని కవయిత్రుల శ్రేణి ఒకటి కూడా ఉంది.

బండి బాపమ్మ మీనాక్షీ శతకం చేసింది.

రత్నాంబ వెంకట రమణ శతక కర్త్రి.

చెలికాని చెల్లాయమ్మ జానకీ శతకము, పార్థసారథి శతకము, ఈమె రచనలు.

—శ్రీ చింతగుంట హనుమంతరావు

★